క్లుప్తంగా

రేపు కబడ్డీ పోటీలు

తుక్కుగూడ: మకర సంక్రాంతి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 14న కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ పూర్వ విద్యార్థులు తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనతరం మాట్లాడు తూ.. స్థానిక పాఠశాలలో చదివి 25 సంవత్స రాలు పూర్తి చేసుకున్న 1989- 99 టెన్త్ బ్యాచ్‌కు చెందిన శక్తి టీమ్ సభ్యులు ఈ ఏడాది పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పూర్వ విద్యార్థులందరూ పాల్గొని పోటీలను విజయ వంతం చేయాలని కోరారు.

టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కమిటీ సభ్యులు

మీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ (టీఎస్‌యూటీఎఫ్) సంఘం బాలాపూర్ మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కరంటోత్ గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం మీర్‌పేట జిల్లెలగూడలోని ప్రభుత్వ పాఠశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.శంకరయ్య, ఉపాధ్యక్షులుగా ఈ.జోయల్, పి.నాగమణి, ప్రధాన కార్యదర్శిగా డి.ఆంజనేయులు, కోశాధికారిగా చెన్నప్పనాయుడు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని తెలిపారు. అదే విధంగా ఎన్నికల మేనిఫెస్టో హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని, దీంతో పాటు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు శంకర్‌నాయక్, గణేష్ కుమార్‌లు పాల్గొనగా, ఎన్నికల అధికారిగా కే.గోపాల్‌నాయక్ వ్యవహరించారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మాణ సామగ్రి తొలగింపు

హయత్‌నగర్: ప్రభుత్వ స్థలంలో అక్రమంగా డంపింగ్ చేసిన భవన నిర్మాణ సామగ్రిని శుక్రవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... బాగ్ హయత్‌నగర్ సర్వే నెంబర్ 207లోని ప్రభుత్వ స్థలంలో ఇటుకలు, మట్టి, డస్ట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు డంపింగ్ చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది అక్రమ డంప్ చేసిన సామగ్రిని తొలగించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలంలో ఎలాంటి కార్యకలాపాలను అనుమతించమని, ఎవరైనా నిర్మాణాలు చేసేందుకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

చంపాపేట: డివిజన్‌లోని కాలనీల్లో నెలకున్న మౌలిక సమస్యలను పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దటమే తన ప్రధాన లక్ష్యమని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని మారుతీనగర్ కాలనీవాసుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆయన సర్కిల్ అధికారులతో కలిసి కాలనీలో పాదయాత్ర నిర్వహించి గుంతలుగా మారిన కాలనీ అంతర్గత రహదారులు, లోప్రెజర్ తాగునీటి సరఫరా, తరలింపునకు నోచుకోని చెత్తకుప్పలను పరిశీలించారు. స్పందించిన ఆయన చెత్త కుప్పలను వెంటనే తరలించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ...కాలనీలోని సమస్యలన్నింటినీ త్వరలో ప్రత్యేక నిధులు మంజూరు చేయించి పరిష్కరిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్కిల్ ఏఈ సురేష్, సిబ్బంది రాజు, వాటర్ వర్క్స్ మేనేజర్ రమ్యభారతి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు రమేష్, శ్రీనివాసరెడ్డి, నవీన్‌కుమార్, జనార్దన్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పండుగల విశిష్టత తెలియజేయాలి

మలక్‌పేట: చిన్ననాటి నుంచే పిల్లలకు మన పండుగలు, పర్వదినాల విశిష్టత తెలియజెప్పాలని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ ఈడీఎస్ఐ శాఖలో సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. రైతులు, హరిదాసులు, జంగమయ్య వేషధారణలతో చూపరులను ఆకట్టుకున్నారు. విద్యార్థులకు సాంస్కృతిక, ముగ్గులు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జోన్ డీజీఎం హేమాంబర్, వైస్ ప్రిన్సిపాల్ రాధిక, ఏడీ శ్రీకాంత్, ఏఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కేటాయింపు మరిచారు!

రూ.లక్షల వెచ్చించి నిర్మించిన వీధి వ్యాపారుల షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఎన్నికల నేపథ్యంలో షెడ్ల కేటాయింపులో జాప్యం జరిగినప్పటికీ నేటికీ అర్హులకు ఇవ్వకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నెలవులుగా మారాయి. దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది.

షెడ్లు పూర్తయి మూడు నెలలు
- అలంకారప్రాయంగా వీధివ్యాపారుల సముదాయం



అలంకారప్రాయంగా ఉన్న వీధి వ్యాపారుల సముదాయం

మీర్‌పేట: షెడ్ల కేటాయింపు ఎప్పుడాని వీధి వ్యాపారులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా అలంకార ప్రాయంగా షెడ్లు దర్శనమిస్తున్నాయి. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో వీధి వ్యాపారులు ఉపయోగార్థంతో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు అప్పటి విద్యాశాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి మంత్రాల చెరువు వద్ద శాశ్వత షెడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకు రూ.60 లక్షల వ్యయంతో వీధి వ్యాపా రులకు 46 షెడ్ల సముదాయాన్ని నిర్మించారు. గత సంవత్సరం అక్టోబరు నెలలోనే సబితారెడ్డి షెడ్లను ప్రారంభించారు. నిర్మాణం పూర్తయి దాదాపు మూడు నెలలు కావస్తున్నా అర్హులకు నేటికీ షెడ్లు కేటాయించలేదని స్థానికులు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కేటాయింపులో ఆలస్యమైనప్పటికీ, ఎన్నికలు జరిగి నెల రోజులైనా కార్పొరేషన్ అధికారులు షెడ్ల కేటాయింపు ఊసే ఎత్తడం లేదని స్థానిక వీధి వ్యాపారులు వాపోతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

పూర్తయిన షెడ్లను వీధి వ్యాపారులకు అందజేయకపోవడంతో వాహనాల పార్కింగ్, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయిందని పరిసర కాలనీల వాసులు తెలిపారు. పక్కనే ఉన్న ఓ వాణిజ్య సముదాయానికి వచ్చే వారు షెడ్ల వద్ద ఉన్న ఖాళీ స్థలంలో తమ వాహనాలను పార్కు చేస్తున్నారని, దీంతో పాటు రాత్రివేళల్లో నిర్మానుష్యంగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. అలంకార ప్రాయంగా ఉన్న షెడ్లను వెంటనే అర్హులైన వీధి వ్యాపారులకు కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

లాటరీ పద్ధతిలో కేటాయింపు



షెడ్ల కేటాయింపునకు సంబంధించి కార్పొరేషన్ పరిధిలో వీధి వ్యాపారుల వివరాలు తీసుకున్నాం. అర్హులైన వారిని గుర్తించి లాటరీ పద్ధతిలో షెడ్లను కేటాయిస్తాం. ముందుగా షెడ్లకు క్యాబిన్‌ల ఏర్పాటు పూర్తయ్యాక లాటరీ ప్రక్రియ చేపడతాం.

– గోపీనాథ్, డీఈ, మీర్‌పేట కార్పొరేషన్



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

క్రీడలతో శారీరక దారుఢ్యం

పెండ్యాలలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

మహేశ్వరం: క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం పెంపొందుతుందని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెండ్యాల ఉన్నత పాఠశాల ఆవరణలో రామిరెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, అంజిరెడ్డి ఆర్థిక సౌజన్యంతో నవభారతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో స్వామి వివేకానంద జయంతి, సంక్రాంతి పండుగ సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. పెండ్యాలలో ఏటా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నవభారత్ యూత్ క్లబ్ అధ్యక్షుడు కుమార్ గౌడ్, సభ్యులు రాజేశ్, హన్మంత్‌రెడ్డి, బాల్‌రాజ్, శ్రీధర్‌రెడ్డి, ప్రహ్లాద్‌రెడ్డి, వజ్రం రెడ్డి, అశోక్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, షరీఫ్, కరుణాకర్, సామయ్య తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

నగరవాసుల పల్లెబాట



సొంతూరు వెళ్లేందుకు ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో బస్సెక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

- సంక్రాంతికి వెళ్లే ప్రయాణికులతో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు కిటకిట
- సరిపోని అదనపు బస్సులు
- రోడ్లపైనే జనం పడిగాపులు

మన్సూరాబాద్: సంక్రాంతి సెలవులు రావటంతో నగరవాసులు తమ సొంతూళ్ల బాటపట్టారు. పల్లెబాట పట్టిన పట్నం వాసులతో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు కిక్కిరిసి పోయింది. పాఠశాలలు, కాలేజీలకు పండుగ సెలవులు ఇవ్వడంతో తమ పిల్లలను తీసుకొని స్వగ్రామాలకు వెళ్లేందుకు వచ్చిన వారితో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు కిటకిటలాడుతోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీ అదనపు బస్సులను నడుపుతోంది. అయినా బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికులు రింగ్‌రోడ్డులో రోడ్డుపైనే బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రెండు తెలుగు రాష్ట్రాల ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్ సేవలందిస్తున్నారు. ప్రత్యేకంగా టెంట్లు వేసి ప్రయాణికులు కూర్చునేందుకు కూర్చీ లు వేశారు. తాగునీటి వసతి, బయోటాయిలెట్లు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ఇబ్బందులు కల్గకుండా ప్రత్యేకంగా ఉన్నతాధికారిని నియమించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ప్రైవేటు ఆపరేటర్ల దోపిడీ

పల్లెబాట పట్టిన పట్నం వాసులు నగర శివారు ప్రాంతమైన ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డుకు భారీగా చేరుకుంటున్నారు. అంతేస్థాయిలో ఆర్టీసీ బస్సులు నడుపుతున్నా... ప్రైవేటు దోపిడీని అరికట్టలేకపోతున్నారు. ప్రయాణికుల నుంచి సాధారణ చార్జీలకన్న నాల్గు, ఐదు రెట్లు ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారు. రవాణా, పోలీస్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వదలేయడంతో ప్రైవేటు ఆపరేటర్ల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది.

ప్రయాణికులకు సరైన సౌకర్యాలు లేవు

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎల్‌బీనగర్ కూడలి ఎల్‌పీటీ మార్కెట్ రహదారి వద్ద ప్రయాణికులకు సరైన ఏర్పాట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం మేరకు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శుక్రవారం ఎల్‌బీనగర్ కూడలి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై సైక్లింగ్ ట్రాక్ పేరిట చేపట్టిన నిర్మాణాలతో రోడ్డు ఇరుకుగా మారి బస్సులు రోడ్డుపైనే నిలుస్తుండటంతో ప్రయాణికులు భయాందోళనలు చెందుతున్నారన్నారు. ఎల్‌బీనగర్ కూడలి వద్ద బస్‌షెల్టర్లు ఏర్పాటు చేసి, ప్రయాణికులకు వసతి కల్పించాలని పలుమార్లు కోరినా గత ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

– మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు..



ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు నుంచి సుమారు 150పైగా ప్రత్యేక బస్సులను నడిపాం. చివరి ప్రయాణికుడిని కూడా గమ్యస్థానానికి చేరేవేసేందుకు ప్రయత్నిస్తున్నాం. నల్లగొండ, ఖమ్మం, విజయవాడ మూడు జోన్లను ఏర్పాటు చేసి అదనపు సిబ్బందిని నియమించి ఏర్పాట్లను పరిశీలిస్తున్నాం. ప్రయాణికులు ఏ రూట్‌వైపు ఎక్కువగా ఉంటే వెంటనే ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేస్తున్నాం. కాలనీలవాసులు, బంధువులు మిత్రులు కలిసి బస్సు కావాలంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తాం.

– శ్రీనివాసులు, కంట్రోలర్ ఇన్‌చార్జి, హైదరాబాద్

కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్‌బీనగర్: కాలనీల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్‌లోని శ్రీ పురం కాలనీ, ఫేజ్-2లో రోడ్లకు ఇరువైపులా చెట్ల కొమ్మలు ఇబ్బందికరంగా ఉన్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన గురువారం సంబంధిత సిబ్బందిని తీసుకెళ్లి చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆండాళ్ నిలయంలో వైభవంగా నిరాటోత్సవం

మలక్‌పేట: ధనుర్మాస తిరుప్పావై ప్రవచనోత్సవాల్లో భాగంగా శుక్రవారం మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో 'కుదారై వెల్లుంశీర్' నిరాటోత్సవాన్ని వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు గోదారంగనాథులకు 108 వెండి గంగాళాములతో విశేష ప్రసాద నివేదన గావించారు. అనంతరం స్వామివారికి మంగళహారతులు సమర్పించారు. అప్పన్ కందాడై పెరుమాళ్లాచార్యస్వామి గోదాదేవి వైభవంపై ప్రవచనం ఇచ్చారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించరాదు



ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

మలక్‌పేట: ప్రమాద రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం చంద్రశేఖర్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మలక్‌పేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు 'ట్రాఫిక్ సేఫ్టీ నిబంధనల'పై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, రాంగ్ రూట్‌లో వెళ్లడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటివి చేయకూడదని, స్టాప్‌లైన్, జీబ్రా క్రాసింగ్ వద్ద ఆటోలు ఆపాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అనుసరించాలని, అతివేగం పనికిరాదని, పరిమితికి మించి ప్యాసింజర్లను కూర్చోపెట్టరాదన్నారు. లైసెన్స్ లేకుండా ఆటోలు నడుపరాదన్నారు.నిర్లక్ష్యం చేయకుండా లైసెన్సులు, డాక్యుమెంట్లు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు.లైసెన్స్ ఉన్న వారికి మాత్రమే ఇన్సూరెన్స్ క్లైమ్ చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్యాసింజర్లతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు రాము, రామస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత వివేకానందుడు



మీర్‌పేట: జాతీయ నాయకుల వేషధారణలో లార్డ్స్ స్కూల్ విద్యార్థులు చిత్రంలో మేయర్ దుర్గ



మీర్‌పేట: లలితానగర్ చౌరస్తాలో నివాళులర్పించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



తుక్కుగూడ: వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

- యువత ఆయన చూపిన మార్గంలో నడవాలి
- ప్రజాప్రతినిధులు, నాయకుల పిలుపు
- ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

మీర్‌పేట: స్వామి వివేకానందుడు ప్రతిఒక్కరికీ స్ఫూర్తి ప్రదాత అని, ఆయన చూపిన మార్గంలో పయనించి యువత ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పిలుపునిచ్చారు. వివేకానందుడి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మీర్‌పేట కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్ ఆధ్వర్యంలో లలితానగర్ ఎక్స్‌రోడ్డులో సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమానికి మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై వివేకానందుడినికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లార్డ్స్ స్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

బీజేపీ మీర్‌పేట అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి, కీసర గోవర్ధన్‌రెడ్డి, గాజుల మధు, సోమేశ్వర్, కార్పొరేటర్లు భిక్షపతిచారి, కరుణానిధి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘన నివాళి..

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని సర్దార్‌నగర్‌లో వివేకానందుడి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశ సేవకు పాటుపడాలి..

కందుకూరు: మండల కేంద్రంలో వివేకానందుడి జయంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తాలోని వివేకానందుడి విగ్రహానికి పూల మాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుని దేశ సేవకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ఢిల్లీ భానుప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ మణికుమార్, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ సాయి, జగదీష్, సంపత్, రాజేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హుడాకాంప్లెక్స్‌లో..

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ రోడ్ నం-1లో వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు డా.లింగారెడ్డి వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు రామమూర్తి, కాలనీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు, మహిళా మండలి అధ్యక్షులు మమత, కార్యదర్శి సరిత, జనార్దన్‌రెడ్డి, దయాకర్, కృష్ణ, వాణి, రమా, సత్యనారాయణరెడ్డి, వనిత, బల్వంతరెడ్డి పాల్గొన్నారు.

హుడాకాంప్లెక్స్‌లో..

హుడాకాంప్లెక్స్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జంయతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి రావినూతల శశిధర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగర బోయిన సురేష్, రామారావు పాల్గొన్నారు.



కందుకూరు: చౌరస్తాలో వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు



హుడాకాంప్లెక్స్: డాక్టర్స్ కాలనీలో..



హుడాకాంప్లెక్స్‌లో జయంతిలో పాల్గొన్న వీహెచ్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశిధర్

రక్తదానం ప్రాణదానంతో సమానం

హస్తినాపురం: రక్తదానం ప్రాణదానం లాంటిదని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఉందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని నల్లపోచమ్మ ఆలయం ప్రాంగణంలో స్వామి వివేకానంద 161 జయంతి సందర్భంగా 'మీ కోసం మేమున్నాం' ఫౌండేషన్ చైర్మన్ నారగోని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, పేద మధ్య తరగతి ప్రజలను ఆదుకోవడంలో యువత ముందు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కందకట్ల శివకుమార్‌రెడ్డి, రమేశ్‌బాబు, కందికంటి భరత్‌గౌడ్, మధుసాగర్, జలీల్, ఇబ్రహీం, శంకరయ్య, మనోజ్‌కుమార్, క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.